# 'విద్యార్థులకు రాతప్రతుల పట్ల ఆసక్తి కలిగించాలి'



సభలో మాట్లాడుతున్న స్మార్తి క్రియేషన్స్ సంస్థ కార్యదర్శి పద్మినీ రంగరాజన్

హైదరాబాద్, అక్టోబర్ 31(ఆన్‌లైన్, సిటీబ్యూరో): రాత ప్రతులను భద్రపరచడం కంటే, అధ్యయనం కంటే విద్యార్థుల్లో వాటిపట్ల ఆసక్తి కలిగించాలని కవి రచయిత జయధీర్ తిరుమల రావు అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లోని వారసత్వ విద్యార్థి విభాగం 'ప్రాచీన' ఆధ్వర్యంలో నిర్వహించిన సభ, ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సంపదలో విడదీయరాని భాగమైన వ్రాత ప్రతుల పట్ల విద్యార్థుల్లో చైతన్య కలిగించడం అత్యావశ్యకమని అన్నారు. వాటి పరిరక్షణ విధానాల గురించి స్మార్తి క్రియేషన్స్ సంస్థ కార్యదర్శి పద్మినీ రంగరాజన్ మాట్లాడుతూ అక్షరాలు రూపొందిన నాటినుంచి చర్మాలు, ఆకులు, వస్త్రాలు, లోహాలపై రాసే వారని, కాలక్రమంలో అది కాగితాలు, తరువాత కాలంలో కంప్యూటర్లకు పరిమితమయిందన్నారు. వాటిని అధ్యయనం చేయడానికి విశ్వవిద్యాలయాల్లో రాత ప్రతుల శాఖలు ఏర్పాటుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 'ప్రాచీన' ఇంచార్జి వి.సత్య ప్రసన్న, సయ్యద్ అంకుష్ పాషా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

### సివిల్ వివాదాల్లో తలదూర్చాడని...

# హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, అక్టోబర్ 31(ఆన్‌లైన్ సిటీబ్యూరో): సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొని సెటిల్‌మెంట్లు చేస్తున్నారని హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ ఇన్‌స్పెక్టర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మలక్‌పేటలో నివసించే మనోజ్ కోఠారి కొనుగోలు చేసిన స్థలంపై 2009 నుంచి వివాదం నడుస్తోంది. అయితే మనోజ్ స్థలంపై వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు నడుస్తోంది. ఇలా కేసు పెండింగ్‌లో ఉండగానే మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ స్థలంపై తగాదాల్లో ఉన్న ఒకరికి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నారని మనోజ్ కొఠారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు కేసు ఉండగానే అధికారాన్ని అడ్డుపెట్టుకొని వివాదంగా ఉన్న స్థలంలో నిర్మాణాలు చేయించారని మనోజ్ పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ విషయంపై మలక్‌పేట ఏసీపీకి విన్నవించుకున్నానని, ఆయన కూడా పట్టించుకోలేదని మనోజ్ స్పష్టంచేశారు. దీంతో రిట్ పిటిషన్ దాఖలు చేశానని మనోజ్ చెప్పాడు. ఫిర్యాదు దారుడి తరఫున వాదనలు విన్న కోర్టు 'హోమ్' శాఖ అభ్యర్థన మేరకు కేసు తదుపరి వాదనలను బుధవారానికి వాయిదా వేసింది.